క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావుకు ఘనస్వాగతం



స్టేషన్‌ఘన్‌పూర్: వరంగల్ జిల్లా పర్వతగిరిలోని శివాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి టి.హరీశ్‌రావుకు ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు శనివారం ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రితో కలిసి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు పర్వతగిరికి తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు చిన్న పిల్లల ఉచిత వైద్యశిబిరం

జనగామ: పట్టణంలోని స్వర్ణకళామందిర్ థియేటర్ ఎదురుగా ఉన్న శిశురక్ష పిల్లల ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంసీహెచ్ ఆస్పత్రి చిల్డ్రన్స్ స్పెషలిస్టు డాక్టర్ చాపల కనకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం

జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం(నేడు) ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్, తెలంగాణ గానకోకిల గొట్టె కనకవ్వ హాజరు కానున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్ సీనియర్ నాయకులు డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి ముదిరాజ్, పిట్టల కుమార్, తుపాకుల రాములు, ఇట్టబోయిన రమేష్, కీర్తి వీరేందర్, పెండేలా శ్రీనివాస్, దండు శ్రీనివాస్, పిట్టల సత్యం, పిట్టల సురేష్ తదితరులు ఉన్నారు.

30న సర్వసభ్య సమావేశం

కొడకండ్ల: ఈ నెల 30వ తేదీ(సోమవారం) ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేందర్‌నాయక్ తెలిపారు. ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

యూనిఫామ్ అందజేత



బచ్చన్నపేట: రామచంద్రాపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన బొందుగుల సోమశేఖర్‌రెడ్డి స్కూల్ యూనిఫామ్స్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్యామ్‌మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్‌కు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నామని అన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐలయ్య, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పీవీఆర్'లో బ్లూ డే

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి పీవీఆర్ పాఠశాలలో శనివారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు బ్లూ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పప్పు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బ్లూ రంగు విద్యార్థులకు ఎంతో ఇష్టమైనదని, చిన్నారులు ఈ రంగును చూసేందుకు ఎక్కువగా ఇష్టపడతారని అన్నారు. నీలిరంగు ప్రేమ, స్వేచ్ఛ, సమానత్వం, సృజనాత్మకతకు రూపంగా భావిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి.

పిక్నిక్‌లు విజ్ఞానం, వినోదానికి దోహదం



చిల్పూర్: చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు పిక్నిక్‌లు దోహదపడతాయని లింగంపల్లి సర్పంచ్ ఎదునూరి రవి అన్నారు. లింగంపల్లి గ్రామసమీపంలోని సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణానికి అంగన్‌వాడీ చిన్నారులు శనివారం పిక్నిక్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు శోభ, సౌభాగ్యలక్ష్మి, నాయకులు రచ్చ రవీందర్, ఎల్లగౌడ్, చిన్నారులు పాల్గొన్నారు.

గుడిసెల కూల్చివేత

- నమిలిగొండలో ఘటన
- న్యాయం చేయాలంటూ బాధితుల నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు, (ఇన్‌సెట్‌లో) రెవెన్యూ సిబ్బంది కూల్చివేసిన గుడిసెలు

స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండ శివారులోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను శనివారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేయడంతో అదే స్థలంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు గాదె రాంచంద్రం, గాదె శ్రీధర్, ప్రభాకర్, గాదె బుచ్చమ్మ, ఉపేంద్ర తదితరులు మాట్లాడుతూ.. నమిలిగొండకు చెందిన ఎస్సీ, బీసీ నిరుపేదలు 180 మందికి 1999లో, అలాగే 2010లో 40 మందికి ఆయా ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలు ఇచ్చాయని చెప్పారు. అయితే నమిలిగొండ శివారు 175 సర్వే నంబర్‌లో 220 మందికి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారే తప్ప స్థలాలు చూపించలేదన్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తుండగా.. ఇటీవల ఆ స్థలంలో రైతు వేదిక, విద్యుత్ ఉప కేంద్రం నిర్మించారని చెప్పారు. అంతేకాకుండా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తామని ప్రకటించగా.. తమకు ఇచ్చిన పట్టాల ఆధారంగా స్థలాలు చూపించాలని కోరుతూ నెలన్నర క్రితం సర్వే నంబర్ 175లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నట్లు బాధితులు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రాజయ్య, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా రెవెన్యూ సిబ్బంది తెల్లవారు జామున జేసీబీతో గుడిసెలు కూల్చివేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు కొమురయ్య, మొగిలి, అనురాధ, ఎల్లమ్మ, వెంకటయ్య, శ్రీను, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. నమిలిగొండ శివారు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇష్టారాజ్యంగా గుడిసెలు వేస్తున్నారు. వాస్తవంగా ఇండ్ల స్థలాలు లేని పేదలు ఉంటే దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన న్యాయం చేస్తాం.

– పూల్‌సింగ్‌చౌహాన్, తహసీల్దార్

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న యశ్వంతాపూర్ వాసులు

జనగామ రూరల్: డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల పరిధి యశ్వంతాపూర్ గ్రామస్తులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చాలామంది నిరుపేదలున్నారని, నిలువ నీడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాయకష్టం చేసి జీవనం గడుపుతున్నామని, తెలంగాణ వచ్చినప్పటి నుంచి గ్రామంలో సంక్షేమ పథకాలు గ్రామస్తులకు అందడం లేదన్నారు. అర్హులందరికీ రూ.3 లక్షలు ఇవ్వాలని కోరారు.

సోమేశ్వరుడి సన్నిధిలో దైవజ్ఞ శర్మ



పాలకుర్తి టౌన్: సరస్వతీ ఉపాసకులు, సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ శనివారం శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బమ్మెర పోతన క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఈఓ నండూరి రజనీకుమారి, అర్చకులు దేవగిరి రామన్న, లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తరిగొప్పుల: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆసరా, కళ్యాణలక్ష్మి, దళిత బంధు, రైతు బంధు, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి, మిషన్ కాకతీయ, భగీరథ, కంటి వెలుగు, హరితహారం, పల్లెప్రగతి తదితర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ అమిరిశెట్టి వీరేందర్, పంచాయతీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కారోబార్ అక్తర్, కళాజాతా బృందం సభ్యులు బానోత్ గణేష్, పిన్నింటి రత్నం, బావండ్లపల్లి చిరంజీవి, కనకరాజు, హరిప్రసాద్, శ్రీనివాస్, చామంతి, చంద్రశేఖర్, పద్మ, రంజాన్‌బీ పాల్గొన్నారు.

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సమక్షంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సికింద్రాబాద్‌కు చెందిన పి.శంకర్–బాలమణి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. చిర్ర నాగరాజు, కుంచాల సంపత్‌రాజు, జంగిటి కుమార్, వేల్పుల గట్టయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

జఫర్‌గఢ్: రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ తాటికాయల అశోక్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ యార మంజుల, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారావు, అనంతుల కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్' కేంద్రం ప్రారంభం

చిల్పూరు: విద్యార్థులు ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ తేజావత్ మోహన్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు శనివారం బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కర్ణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంజీవరావు, కిషన్‌రెడ్డి, చంద్రమోహన్, రుద్రమదేవి, ఉమ, ఆధార్ ఆపరేటర్ శ్రీపతి మహేష్‌గౌడ్,యాకన్న, రమేష్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



చెక్కు పంపిణీ చేస్తున్న రామోజీ

కొడకండ్ల: ఆపదలో పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసాగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. శనివారం రామవరం గ్రామానికి చెందిన నారాయణ, శ్రీనివాస్‌లకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్, ఎంపీటీసీలు శిరీష, మణెమ్మ, సొసైటీ వైస్ చైర్మన్ సోమరాములు, యాకూబ్, రణధీర్, ఆశయ్య, కుమార్, వెంకటేష్, నాగయ్య, శ్రీను, కర్ణాకర్ పాల్గొన్నారు.

'అరిగోస' దీక్షను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రవీందర్

లింగాలఘణపురం: ఈ నెల 30న మంద కృష్ణమాదిగ నేతృత్వంలో హైదరాబాద్‌లో జరిగే అనాథల అరిగోస దీక్షను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సందెన రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అనాథ పిల్లల హక్కుల కోసం ఏర్పాటు చేసిన సమావేశం వీహెచ్‌పీఎస్ మండల కన్వీనర్ గడ్డం సోమరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రవీందర్ పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు లేని అత్యంత నిస్సహాయ స్థితిలో ఆదరణ లేకుండా ఉన్న అనాథ పిల్లలకు స్మార్ట్ కార్డులు, 5 శాతం రిజర్వేషన్లు, కేజీ టు పీజీ రెసిడెన్షియల్ విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని, గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనాథ పిల్లల కోసం మందకృష్ణ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అండగా ఉంటుందని, ఈ నెల 30 చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మేడ శ్రీనివాసు, రాంనర్సయ్య, నర్సయ్య, నర్సింహులు, కనకయ్య, కరుణకార్, మధు, శ్రీకాంత్, చందుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టులకు 'కంటి వెలుగు' శిబిరం

జనగామ రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక 'కంటి వెలుగు' శిబిరాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారికి ఈనెల 30న కలెక్టరేట్‌లోని రూం నంబర్ జీ21లో శిబిరం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

24 గంటల విద్యుత్ అందించాలి

జనగామ రూరల్: జిల్లాలో అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, 24 గంటల విద్యుత్ అందించి వారిని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకే ఇస్తుందన్నారు. పంటలకు తెగుళ్లు ఆశించి దెబ్బతింటున్నాయని, నీటి అవసరమున్న మొక్కజొన్న, మిర్చి పంటలు ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జూనియర్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న జన్ను విజయ్‌కుమార్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం స్థానిక మార్కెట్‌లో చైర్మన్ గుజ్జరి రాజు, కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది అతడిని సన్మానించారు. మార్కెట్ డైరెక్టర్లు పెంతల రాజ్‌కుమార్, వరుణ్, బీఆర్‌ఎస్ నాయకులు, మార్కెట్ సిబ్బంది, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అక్రమంగా తాటిచెట్ల నరికివేత



నరికివేసిన తాటిచెట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో కుంటకట్ట, అమ్మవారి దేవాలయం సమీపాన ఉన్న దాదాపు 50కి పైగా తాటిచెట్లను అక్రమంగా నరికివేశారని శివునిపల్లి గీత కార్మికులు ఆవేదన చెందుతున్నారు. తమ సొసైటీ అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా తమకు ఉపాధి అందించే తాటిచెట్లను నరికారని వాపోతున్నారు. ఈ మేరకు శివునిపల్లి పారిశ్రామిక సొసైటీ అధ్యక్షుడు వంగ శ్రీనుగౌడ్ మాట్లాడుతూ తమ అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా తాటిచెట్లను నరికివేశారని, ఈ విషయమై ఎక్సైజ్‌శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత పారిశ్రామిక సొసైటీ బాధ్యులు కూనూరు ఎల్లగౌడ్, వంగ ప్రభాకర్, వంగ సురేష్, తిరుపతి, వేణు, పల్లె అశోక్ పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



జనగామ రూరల్: డీఆర్‌డీఏ, సెర్ప్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ క్యాలెండర్, డైరీని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైనసేవలు అందిస్తున్నదుకు వారిని అభినందించారు. డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఎం.శంకరయ్య, ఏపీడీ నూరుద్దీన్, డీపీఎం సమ్మక్క, వరలక్ష్మి, వినీత, జాక్ కన్వీనర్ సంపత్, శ్రీనివాస్, ఆనందం, శోభ, నర్సయ్య పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బచ్చన్నపేట: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతు వేదిక భవనంలో మండల పరిధి గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనతో రాష్ట్రానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధితోపాటు రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవడానికి రైతు బంధు, బీమా, ఉచిత విద్యుత్ లాంటి సదుపాయాలు కల్పించారని చెప్పారు. అలాగే మహిళలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు ఆడ పిల్లలు భారం కాకూడదని వారి పెళ్లికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్ష అందజేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, తహసీల్దార్ వినయలత, మండల స్పెషలాఫీసర్ వినోద్‌కుమార్, సర్పంచ్‌లు మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగమ్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి పొందాలి

యువత స్వయం ఉపాధి పొంది సమాజంలో గౌరవంగా జీవించాలని ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి అన్నారు. శనివారం కేసిరెడ్డిపల్లిలో టీఆర్‌ఎస్ నాయకుడు గాలి తిరుపతి నూతనంగా పెట్టుకున్న టైలర్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించి లాల్చీ, పైజామా కుట్టించుకోవడానికి కొలతలు ఇచ్చారు.

ఇష్టపడి చదవాలి



పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న భిక్షపతి

నర్మెట: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఏఈ బానోత్ భిక్షపతి అన్నారు. మండలంలోని హన్మంతాపూర్ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో పరీక్ష ప్యాడ్‌లు, నోటుబుక్స్, పెన్నులు తదితర సామగ్రిని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కపేటకు చెందిన తను ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసి బోడుప్పల్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ హైదరాబాద్‌లో స్థిరపడ్డానని అన్నారు. సొంత ఊరు కన్నతల్లితో సమానమని, చదువుకున్న పాఠశాల జీవితాన్నిచ్చిందని అందుకే తనవంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. హెచ్‌ఎం బాలకుమార్, వార్డు సభ్యుడు బానోత్ రమేష్, యూత్ నాయకులు బానోత్ మోహన్, సుమన్, రామన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏడీ చంద్రమౌళి

కొడకండ్ల: గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని వెటర్నరీ ఏడీ చంద్రమౌళి అన్నారు. శనివారం మండలకేంద్రంలో జీఎంపీఎస్ క్యాలెండర్‌ను ఏడీ ఆవిష్కరించి మాట్లాడారు. జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సోనాబాబు, మండల అధ్యక్షుడు మేకల రమేష్, భిక్షపతి, కొమురయ్య, యాకేష్, నర్సయ్య, లింగయ్య, కొమురయ్య, కుమార్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి



చిల్పూరు: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని సర్పంచ్ ఏదునూరి రవీందర్ అన్నారు. మండలంలోని లింగంపల్లిలో శనివారం బ్యాడ్మింటన్ క్రీడాకారులకు 10 బ్యాట్లు, నెట్, వాలీబాల్ సెట్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారానే గ్రామాలకు మంచి పేరు వస్తుందని అన్నారు. రచ్చ రవీందర్, యాదగిరి, రమేష్, బుచ్చిరాజు, సతీష్, ఊరడి రాజు, ఎల్లగౌడ్, రవి, కంకటి రవీందర్, గిరి, సాంబరాజు పాల్గొన్నారు.

కేజీకేఎస్ గద్దె కూల్చివేత అమానుషం



కూల్చివేసిన కేజీకేఎస్ గద్దె

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారులోని కల్లుగీత కార్మిక సంఘం గద్దెను రెవెన్యూ అధికారులు కూల్చి వేయించడం అమానుషమని కేజీకేఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల రఘురాములుగౌడ్, గ్రామ అధ్యక్షుడు పులి స్వామి, మాజీ ఎంపీటీసీ పులి యాకయ్య అన్నారు. నమిలిగొండలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. నమిలిగొండ శివారులోని ప్రభుత్వ స్థలంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేయించే క్రమంలో రెవెన్యూ అధికారులు పక్కనే ఉన్న కేజీకేఎస్ గద్దెను కూల్చివేశారన్నారు. ఆ స్థలంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఈ క్రమంలో గద్దెను కూల్చివేయడం దారుణమన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు సానుకూలంగా స్పందించాలని, గద్దె పునర్నిర్మాణం, సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

చెక్కు అందజేత

జనగామ రూరల్: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయపడిన పెద్దపహాడ్‌కు చెందిన ఈదుల బాబుకు కల్లుగీత కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.15వేల చెక్కును బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రవీందర్ శనివారం అందజేశారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య తదితరులు ఉన్నారు.

ఎడ్ల శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం



జనగామ రూరల్: లీగల్ సెల్‌పై అవగాహన కల్పిస్తున్నందుకు గాను జనగామ మండలంలోని మరిగడి గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్‌కు తమిళనాడు రాష్ట్రంలోని ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. రామ్ రామ్ అకాడమీ చీఫ్‌కోచ్ వి.బాబు విజయన్, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహరన్, ఏపీ రిటైర్డ్ జడ్జి హరిదాస్, యూనివర్సిటీ అధికారుల నుంచి శ్రీనివాస్ పట్టా అందుకున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చిల్పూరు: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ సంతోష్ సూచించారు. మండలంలోని సీతాతండాలో శనివారం సాయంత్రం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జీవితాంతం బాధపడకూడదని చెప్పారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలతో యువత నిర్వీర్యం అవుతుందన్నారు. ఎస్సై వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి టౌన్: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పశువైద్యాధికారి మాడపల్లి శశాంక్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా సలహాదరు నకిర్త యానన్న, సలేంద్ర సోమన్న, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, లింగన్న, బెల్లి లింగన్న, ఐలయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

జఫర్‌గఢ్: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పర్వేజ్ అన్నారు. హనుమకొండ రీజనల్ సైన్స్ సెంటర్ వారి నేతృత్వంలో మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. టీఎస్ కాస్ట్ ప్రతినిధులు సాయిని అశోక్‌కుమార్, కీర్తి, వివేక్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.